సాక్షి
ఖమ్మం
సోమవారం ; 24 ; ఫిబ్రవరి ; 2025



వన్యప్రాణుల దాహార్తి తీర్చేలా

వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు అడవుల్లో సాసర్ పిట్లు, చెక్‌డ్యామ్‌లు ఏర్పాటుచేస్తున్నారు. 8లో



.. విజేత నేలకొండపల్లి జట్టు

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ పోటీల్లో నేలకొండపల్లి జట్టు గెలుపొందింది. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయానికి ఏసీ బహూకరణ



ఏసీ బహూకరిస్తున్న భక్తుడు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన భక్తుడు ప్రసాద్ రూ.40 వేల విలువైన ఏసీని బహూకరించారు. ఈ ఏసీని శ్రీవారి గర్భాలయంలో వినియోగించాలని ఆలయ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ విజయకుమారి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ డి. సోమయ్య, అర్చకులు ఉప్పల రాజీవ్ శర్మ, మారుతి రఘురామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించండి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి



మాట్లాడుతున్న చావా రవి

ఖమ్మం సహకారనగర్ : ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతిపరులకు, అవకాశవాదులకు ఈ నియోజకవర్గంలో స్థానం లేదని నిరూపించాలని అన్నారు. నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందని, పండిట్‌లు, పీఈటీలు సహా వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులను 100 శాతం పాఠశాలలు, కళాశాలలకే కేటాయించారని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పేదలకు వైద్య సహాయానికి రూ.4.50 కోట్లు మంజూరు చేయించారని వివరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్, ఆయా సంఘాల నాయకులు ఎ.వి.నాగేశ్వరరావు, వెంగళరావు, జి.వి.నాగమల్లేశ్వరరావు, షమీ, పద్మ, రాందాస్, ఉద్దండు షరీఫ్, సురేష్ పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యాకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు బలోపేతం

మణుగూరు భారజల కర్మాగారం జీఎం హెచ్‌కే శర్మ

అశ్వాపురం: క్రీడాపోటీలతో ఉద్యోగుల మధ్య స్నేహసంబంధాలు బలోపేతమవుతాయని మణుగూరు భారజల కర్మాగారం జీఎం హెచ్.కే.శర్మ అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో ఉన్న హోమిబాబా టర్ఫ్ వికెట్ క్రికెట్ మైదానంలో జిల్లా ఇండస్ట్రియల్ 12వ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ పీఎస్‌పీడీ, అశ్వాపురం భారజల కర్మాగారం పరిశ్రమలకు చెందిన ఎనిమిది జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. కేటీపీఎస్, నవభారత్ జట్ల మధ్య తొలి మ్యాచ్‌ను జీఎం ప్రారంభించి మాట్లాడారు. అందరూ క్రీడా స్ఫూర్తి చాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాసరావు, అధికారులు, వివిధ పరిశ్రమల ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి భారీగా హాజరైన భక్తులు



నేత్రపర్వం.. శత సహస్రం



పూజలు చేస్తున్న నిర్వాహకులు

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం

- ఏకరూప దుస్తులతో హాజరైన 3 వేల మంది భక్తులు
- వేడుకకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు

ఖమ్మంగాంధీచౌక్ : నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం నేత్రపర్వంగా సాగింది. శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు వివిధ ప్రాంతాలకు చెందిన మూడు వేల మందికి పైగా భక్తులు ఏకరూప దుస్తులు ధరించి హాజరయ్యారు. వేదికపై హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేసి, ఉదయం 7:30 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గణపతి పూజ, గోపూజ చేశారు. ఆ తర్వాత భక్తులు లక్ష హనుమాన్ చాలీసా (108 సార్లు) పారాయణం చేశారు. మహిళలు కాషాయ దుస్తులు, పురుషులు తెలుపు దుస్తులు, కండువాలు ధరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 80 భజన మండళ్లు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి. హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి వలంటీర్లు పలు రకాల సేవలందించారు. పారాయణంలో పాల్గొన్న మూడువేల మందితో పాటు ఇతరులకు కలిపి మొత్తంగా నాలుగువేల మందికి అన్నదానం చేశారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు..

ఖమ్మంలో నిర్వహించిన శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణానికి 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్' అవార్డులు దక్కాయి. ఈ వేడుకను పరిశీలించాల్సిందిగా శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి దరఖాస్తు చేయగా అవార్డు సంస్థలు హాజరయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందేలా కార్యక్రమం నిర్వహించారంటూ అభినందించిన సంస్థల ప్రతినిధులు ఈ రెండు అవార్డులకు ఎంపిక చేశాయి. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో–ఆర్డినేటర్ బింగి నరేంద్ర గౌడ్ శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వరరావుకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి గన్నవరపు నాగేశ్వరరావు, డైరెక్టర్లు లగడపాటి రామారావు, ప్రతాపని నర్సింహారావు, కటకం చిన్న హనుమంతరావు, మోతుకూరి మురళీధర్, పుల్లఖండం సురేష్, బిజ్జాల దుర్గ పాల్గొనగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ తదితరులు హాజరయ్యారు.



అవార్డు అందుకుంటున్న స్తంభాద్రి సమితి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఎన్నికలకు సర్వం సిద్ధం..

- ఈనెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్
- సిబ్బందికి పూర్తయిన శిక్షణ

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 27న ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనుంది. ప్రాధాన్యత ఓటింగ్ విధానంలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో 4,089 మంది ఓటర్లు ఉండగా.. వీరి కోసం 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఈనెల 26న కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేయనున్నారు.

సిబ్బందికి పూర్తయిన శిక్షణ..

ఎన్నికల విధుల నిర్వహణపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.మాధవి సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, మైక్రో అబ్జర్వర్లు, ఓపీఓలకు శిక్షణ ఇచ్చారు. బ్యాలెట్ బాక్స్‌లు తెరవడం, మూసి వేయడం, సీల్ చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హ్యాండ్ బుక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు..

ఇక పోలింగ్ కేంద్రాల్లో కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 24 పోలింగ్ కేద్రాల్లో సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఓటర్లు క్యూ పద్ధతి పాటించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్, టాయిలెట్స్ సౌకర్యం కల్పించారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు కూడా ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల సామగ్రి శనివారం జిల్లాకు చేరగా.. ట్రెజరీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు.

పోలింగ్ ఇలా..

పోలింగ్ రోజు ఉదయం 7.30 గంటలకు సిబ్బంది ఖాళీగా ఉన్న బ్యాలెట్ బాక్స్‌లను ఏజెంట్లకు చూపుతారు. గ్రీన్‌పేపర్‌లో ఏజెంట్ల సంతకాలు తీసుకుంటారు. బ్యాలెట్ బాక్స్‌పై పోలింగ్ కేంద్రం వివరాలు ఉండేలా పేపర్ అంటిస్తారు. ఓటరు కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేస్తారు. ఉదయం 10, మధ్యాహ్నం 12, 2, సాయంత్రం 4 గంటలకు పోలింగ్ నమోదు శాతం వివరాలు వెల్లడిస్తారు. సాయంత్రం 4 గంటల వరకు ఓటరు స్లిప్‌లు ఇచ్చిన ప్రతీ ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత నిబంధనల ప్రకారం బ్యాలెట్ బాక్స్‌లను మూసి సీల్ చేస్తారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎన్నికలను పర్యవేక్షిస్తుండగా.. జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) పద్మశ్రీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా 8 రూట్లుగా విభజించారు. సెక్టార్ అధికారులు సంబంధిత పనుల్లో నిమగ్నమయ్యారు. 24 మంది సూక్ష్మ పరిశీలకులు, 24 మంది పీఓలు, 24 మంది ఏపీఓలు, 45 మంది ఓపీఓలు విధులు నిర్వహిస్తారు. అదనంగా మరికొంత సిబ్బందిని నియమించారు.

అరటి ఆకులు.. మట్టి గ్లాసులు



ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి తన వివాహ వేడుకను ప్లాస్టిక్ రహితంగా మార్చారు. హాజరైన అతిథులకు అరటి ఆకుల్లో భోజనం వడ్డించి మట్టితో చేసిన గ్లాసుల్లో తాగునీరు అందించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంటాయపాలెం గ్రామానికి చెందిన వీదగాని సంపత్ డోర్నకల్ మండలం వెన్నారం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురానికి చెందిన యువతితో ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వివాహం జరిగింది. మండపంలో అరటి ఆకులు, పూలతో డెకరేషన్ చేయించాడు. కాలుష్య రహిత సమాజానికి తన వంతుగా ఇలా కృషి చేస్తున్నానని సంపత్ తెలిపారు. – ఖమ్మంరూరల్

దళితులపై వివక్ష ఇంకెన్నాళ్లు..

- బీజేపీ మనువాద విధానాలను తిప్పికొట్టండి
- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ

ఖమ్మంరూరల్: దళితులపై వివక్ష ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ ప్రశ్నించారు. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కేవీపీఎస్ పాలేరు డివిజన్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే లక్ష్యాలతో ఏర్పడిన సంఘమే కేవీపీఎస్ అని తెలిపారు. రాష్ట్రంలో వేలాది గ్రామాల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, అంటరానితనంపై అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించామని చెప్పారు. ఆలయ ప్రవేశాలు, రెండు గ్లాసుల విధానం, గ్రామాల్లో కులం పేరుతో వివక్షల నిర్మూలనకు కేవీపీఎస్ కృషి చేస్తోందన్నారు. ఎస్సీ జనాభా సంక్షేమం, అభివృద్ధికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయించాలని కోరారు. దళితుల వెనకబాటుకు మనువాదమే ప్రధాన కారణమని, దళితులంతా ఐక్యమై మనువాదులపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు, అంబేడ్కరిస్టులు ఏకమైతే మతోన్మాదుల ఆగడాలు చెల్లవని హెచ్చరించారు. అనంతరం 25 మందితో పాలేరు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సదస్సులో కేవీపీఎస్ నాయకులు బి.రమేష్, పి.నాగేశ్వరరావు, నండ్ర ప్రసాద్, ఎం.భారతి, ఎస్.మనోహర్, ఎం.రమణ, బండి పద్మ, వెంకట్రావు, కొమ్ము శ్రీను, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ, పక్కన నాయకులు

నేటి నుంచి టెన్నిస్ నాకౌట్ మ్యాచ్‌లు



పోటీలకు సిద్ధంగా ఉన్న టెన్నిస్ కోర్టులు

ఖమ్మంస్పోర్ట్స్: ఆల్ ఇండియా ర్యాంకింగ్ పురుషుల టెన్నిస్ పోటీలు సోమవారం నుంచి నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే ర్యాంకింగ్‌లో నిలిచిన 32 మంది హాజరు కాగా క్వాలిఫయింగ్ పోటీల్లో మరో 13 మంది క్వాలిఫై కావడంతో వారికి నాకౌట్ మ్యాచ్‌లను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే, ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, రూ.2.50 లక్షలకు పైగా నగదు బహుమతులు అందించనున్నామని నిర్వాహకులు చల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్ కాసినేని అనిల్‌కుమార్, కాంపాటి సత్యనారాయణ తెలిపారు. మూడు టెన్నిస్ కోర్టులు సిద్ధం చేశామని వివరించారు. కార్యక్రమంలో రిఫరీ ప్రవీణ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'గురుకుల' పరీక్ష

25,317 మంది విద్యార్థులకు 24,556 మంది హాజరు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న గురుకులాల సంస్థ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్ : సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2025 – 26 విద్యా సంవత్సరంలో 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ ప్రవేశ పరీక్ష ఆదివారం భద్రాద్రి జోనల్‌లో ప్రశాంతంగా ముగిసింది. జోనల్‌లో ఉన్న ఖమ్మం జిల్లాలో 18 కేంద్రాలు, భద్రాద్రి జిల్లాలో 18 కేంద్రాలు, మహబూబాబాద్ జిల్లాలో 15, హనుమకొండ జిల్లాలో 16, వరంగల్ జిల్లాలో 10 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జోనల్ అధికారిణి కె.స్వరూపరాణి తెలిపారు. మొత్తం 77 కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి 13,042 మందికి గాను 12,806 మంది హాజరయ్యారని, 236 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 5,163 మందికి 4,881 మంది, ఏడో తరగతికి 2,852 మందికి 2,758, 8వ తరగతికి 2,485 మందికి గాను 2,410 మంది, 9వ తరగతికి 1,775 మందికి గాను 1,701 మంది హాజరయ్యారని వివరించారు. జోనల్‌లో వ్యాప్తంగా అన్ని తరగతులకు కలిపి 25,317 మందికి గాను 24,556 మంది హాజరయ్యారని, 761 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.




తిరస్కరణకు గురైన హాల్ టికెట్ చూపిస్తున్న విద్యార్థి ధీరజ్

ఆదాయం అధికంగా ఉందని నిరాకరణ

ఖమ్మంరూరల్ : మండలంలోని మద్దులపల్లి ఎస్‌బీసీతఈ కళాశాలలో జరిగిన ప్రవేశపరీక్షకు మోదుగు కృష్ణమనోహర్, ఎం. ధీరజ్ అనే ఇద్దరు విద్యార్థులను అనుమతించలేదని, దరఖాస్తు సమయంలో తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 2లక్షల కంటే అధిక ఆదాయం నమోదు చేయడమే ఇందుకు కారణమని జోనల్ అధికారిణి స్వరూపారాణి తెలిపారు. హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో ఆటోమేటిక్‌గా వచ్చాయని, ఈ క్రమంలో వీరిద్దరి పేర్లు తిరస్కరణకు గురయ్యాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు సమాచారం అందించామని చెప్పారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

- ఈ నెల 25, 26, 27 తేదీల్లో తిప్పనున్న సర్వీసులు
- రీజియన్ పరిధిలో 75 బస్సులు



ఖమ్మంమయూరిసెంటర్: మహాశివరాత్రి పర్వదినాన్ని ఈనెల 25, 26, 27 తేదీల్లో పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు సమీప డిపోల నుంచి ఈ సర్వీసులు నడిపేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి జిల్లాలోని తీర్థాల, స్నానాల లక్ష్మీపురం, నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, మోతెగడ్డ, బెండాలపాడు శైవ క్షేత్రాలకు ఖమ్మం రీజియన్‌లోని పలు డిపోల నుంచి 75 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అదనపు చార్జీలతో నడిపే ఈ సర్వీసుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని సైతం వర్తింపజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

సమాచారం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

డిపో	డిపో మేనేజర్	కంట్రోలర్
ఖమ్మం కొత్త బస్టాండ్	99592 25958	99592 25979
ఖమ్మం పాత బస్టాండ్	---	99592 25965
సత్తుపల్లి	99592 25962	99592 25990
మణుగూరు	99592 25963	89853 61796
కొత్తగూడెం	99592 25959	99592 25982
మధిర	99592 25961	73829 25289
భద్రాచలం	99592 25960	99592 25987

డిపోల వారీగా నడిపే బస్సుల సంఖ్య, చార్జీల వివరాలు..

పుణ్యక్షేత్రం	డిపో	బస్సుల సంఖ్య	చార్జీల వివరాలు (రూ.ల్లో)	
			ఫుల్ టికెట్	హాఫ్ టికెట్
తీర్థాల	ఖమ్మం	25	30	20
నీలాద్రి	సత్తుపల్లి	25	50	30
స్నానాల లక్ష్మీపురం	మధిర	10	30	20
మోతెగడ్డ	భద్రాచలం	05	30	20

■ కొత్తగూడెం డిపో నుంచి నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, బెండాలపాడు ప్రాంతాలకు 10 బస్సులు నడపనున్నారు. నీలాద్రి, అన్నపురెడ్డిపల్లికి పెద్దలకు రూ.90, పిల్లలకు రూ.50 చార్జీ ఉండగా.. బెండాలపాడుకు పెద్దలకు రూ.30, చిన్నారులకు రూ.20 చార్జీ వసూలు చేయనున్నారు.

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్, తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో 25న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకిరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ మహేంద్ర, జెన్ ప్యాక్ట్, ముత్తూట్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, క్యూస్ కార్ప్స్ లిమిటెడ్, హెచ్‌ఆర్‌హెచ్ నెక్ట్స్ సర్వీసెస్ లిమిటెడ్, 2050 హెల్త్ కేర్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు 2021 నుంచి 2025 వార్షిక విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని, పూర్తి వివరాలకు 94419 39579, 96188 96949 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

‘పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి’



మాట్లాడుతున్న సుంకర శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ కోరారు. ఆదివారం రాత్రి ఖమ్మం ఎంబీ గార్డెన్స్‌లో నిర్వహించిన బీసీ, ప్రజాసంఘాల సదస్సులో ఆయన మాట్లాడారు. రవీందర్ గెలుపు బీసీల ఆత్మగౌరవానికి సవాల్‌గా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పెళ్లూరి విజయకుమార్, సోమరాజు, వెంకటేశ్వరాచారి, నాసరయ్య, కత్తి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో ఉగాది పురస్కారానికి ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: అమెరికాలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సంఘం (టీఎల్‌సీఏ) ఆధ్వర్యంలో న్యూయార్క్ నార్త్ అమెరికాలోని హిందూ టెంపుల్ సొసైటీలో ఏప్రిల్ 19న జరిగే ఉగాది వేడుకల్లో పాల్గొని పురస్కారం ఇచ్చేందుకు వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదబాబుకు ఆహ్వానం అందినట్లు తెలిసింది. ఉగాది పండుగ సీజన్‌లో తమతో చేరడానికి రావాలంటూ సంఘం ప్రెసిడెంట్ రామిశెట్టి సుమంత్ నుంచి ఆహ్వానం అందిందని సైదబాబు వెల్లడించారు.

గంజాయి పట్టివేత



గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మధిర: మధిర రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం తనిఖీ చేయగా 8 కేజీల గంజాయి దొరికిందని మధిర ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి నాగేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టగా రెండు బ్యాగులు కనిపించగా అందులో సుమారు 8 కేజీల ఎండు గంజాయి పట్టుబడింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రామ్మూర్తి పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ రెడ్డి, సిబ్బంది రజాలి, షేక్ రియాజ్, ముస్తఫా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కొణిజర్ల: ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన మండలంలోని శాంతినగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జి.సూరజ్ కథనం ప్రకారం.. వైరా మున్సిపాలిటీలోని శాంతినగర్‌కు చెందిన కట్ల నిఖిల్ రోజు వారీలాగానే తన ఇంటి ఎదుట పల్సర్ బైక్ తాళం వేసి, నిలిపిఉంచాడు. ఆదివారం ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సూరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

తిరుమలాయపాలెం: మండల కేంద్రం సమీపంలోని ఓ మామిడి తోటలో కోళ్ల పందేలు నిర్వహిస్తుండగా ఆరుగురిని టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన నలమాస వెంకటేశ్, ఎల్ది ప్రదీప్, మంచినీళ్ల రాజేశ్, వాంకుడోత్ గణేశ్, గుగులోత్ రాజు, చీమ శంకర్.. ఆంజనేయులు మామిడి తోటలో కోళ్ల పందేలు నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న నాగరాజు అనే వ్యక్తి కోడి పుంజుతో పరారవగా అతడే కోడి పందేలకు ప్రధాన సూత్రదారిగా పోలీసులు గుర్తించారు. నాలుగు మోటార్ సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక కోడిపుంజు, రూ.1,020 నగదుని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,487

తాగునీటి సమస్య లేకుండా అటవీశాఖ చర్యలు

- అటవీప్రాంతంలో చెక్ డ్యామ్‌లు, నీటి కుంటలు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో 8,409 వన్యప్రాణులు



జంతువుల కోసం ఏర్పాటు చేసిన కుంటలో నీరు పడుతున్న సిబ్బంది

వన్యప్రాణుల దాహార్తి తీరేలా..



చుంచుపల్లి: వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి వేసవిలో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండల తీవ్రతకు అటవీ ప్రాంతాల్లో కుంటలు, చెలిమలు, వాగులు ఎండిపోయి నీటి ఎద్దడి నెలకొంటుంది. దాహార్తి తీర్చుకునేందుకు జింకలు, దుప్పులు, కనుజులు, ఎలుగుబంట్లు, కొండ గొర్రెలు తదితర వన్యప్రాణులు సమీప గ్రామాలకు, మైదాన ప్రాంతాలకు వెళ్లి మృత్యువాత పడుతున్నాయి. దీంతో అటవీ జంతువుల దాహం తీర్చేందుకు ఐదేళ్లుగా ఫారెస్ట్ శాఖ అధికారులు సాసర్ పిట్లు, చెక్ డ్యామ్‌లు, నీటి కుంటలు నిర్మిస్తున్నారు. వీటిలో ట్యాంకర్లతో మూడు రోజులకోసారి నీటిని నింపనున్నారు. ఇందుకోసం కంపా, బయోసాట్ పథకాల నిధులు కేటాయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో దట్టమైన అడవులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం, కిన్నెరసాని, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు 8 అటవీ డివిజన్లు విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలో 680.02 చదరపు కిలోమీటర్లు దట్టమైన అడవులు ఉండగా, 1764.15 చదరపు కిలోమీటర్ల మేర మధ్య స్థాయి అడవులు, ఇక ఓపెన్ అడవులు 1024.96 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 591 చెక్ డ్యామ్‌లు, 861 సాసర్ పిట్లు, 402 పెద్ద నీటి కుంటలు, 379 చిన్న నీటి కుంటలు, 100 వరకు సోలార్ పంపుసెట్ల ద్వారా వన్యప్రాణులకు తాగునీరు అందించేందుకు అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి అటవీ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేలా ప్రణాళికలను రూపొందించారు. నీటి వనరులు ఉన్న ప్రాంతాలను పసిగట్టి కొందరు వేటగాళ్లు మాటు వేస్తుండటంతో అటవీ అధికారులు ట్రాపింగ్ కెమెరాల ద్వారా నిఘా పెడుతున్నారు.

వన్యప్రాణులను కాపాడేందుకు చర్యలు



వేసవి కాలంలో సహజంగా నీటి వనరులు ఎండిపోయి దాహంతో వన్యప్రాణులు అల్లాడిపోతాయి. అటవీ జంతువులకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. జంతువులు అధికంగా సంచరించే ప్రాంతాల్లో సాసర్‌పిట్లు, నీటి కుంటలు ఏర్పాటు చేసి నిత్యం నీరు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. – కిష్టాగౌడ్, డీఎఫ్‌ఓ

నిరంతరం పర్యవేక్షిస్తాం



వేసవికాలంలో అటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటి కొరత లేకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటాం. నీటి కుంటలు, సాసర్‌పిట్లు, చెక్ డ్యామ్‌ల ద్వారా వన్యప్రాణులకు నీటి సమృద్ధిగా అందిస్తాం. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంతోపాటు సిబ్బందితో కలిసి నిరంతరం పర్యవేక్షిస్తాం.
– బి.రామకృష్ణ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్

పెద్దాస్పత్రిలో స్థల వివాదం..



ఇటీవల స్థలం వద్ద రెవెన్యూ, వైద్యశాల అధికారులకు హైకోర్టు తీర్పు కాపీలను చూపిస్తున్న సంబంధిత కుటుంబ సభ్యులు (ఫైల్)

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో కొంత భాగం స్థలం తమకే చెందుతుందని ఓ కుటుంబం చెబుతోంది. హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా అధికారులు మాత్రం ఆ స్థలాన్ని తమకు స్వాధీనం చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపిస్తోంది. ఆదివారం ఆ కుటుంబ సభ్యులు స్థలం వద్దకు వచ్చి హద్దులు ఏర్పాటు చేసుకొని బ్యానర్లు కట్టారు. ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు 60 ఏళ్ల కిందట 24 ఎకరాల స్థలాన్ని ఒకరి వద్ద ప్రభుత్వం కొనుగోలు చేసి ఆస్పత్రిని నిర్మించింది. ఆ సమయంలో వారికి రూ.లక్ష పరిహారంగా చెల్లించింది. క్రమక్రమంగా ఆస్పత్రి అభివృద్ధి చెంది ప్రస్తుతం డీఎంఈ పరిధిలోకి వెళ్లిపోయింది. 2022 జూలైలో ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో 21.31 ఎకరాలు, పాత కలెక్టరేట్ పరిధిలోని 5.23 ఎకరాలు, ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి చెందిన 3.09 ఎకరాల స్థలం మొత్తం కలిపి 30.23 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కేటాయించారు. అయితే, ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన పాత ధర్నాచౌక్ స్థలం, ఆస్పత్రిలోని పార్కింగ్ స్థలం కలుపుకొని 1,210 గజాలు తమ పూర్వీకులకు చెందిందని, అది తమకు చెందుతుందని రమణగుట్టలోని వికలాంగుల కాలనీకి చెందిన ఓ కుటుంబం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ స్థలం తమకే చెందుతుందని హైకోర్టు తీర్పు ఇచ్చిందని వారు చెబుతున్నారు. స్థలం తమకు స్వాధీనం చేయాలని ఎన్నిసార్లు వేడుకున్నా అధికారులు స్పందించడం లేదని, చుట్టూ తాళ్లు కట్టి, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ విషయాన్ని ఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లగా పూర్తిస్థాయి విచారణ చేస్తామని చెప్పారని, తమకు నోటీసులు అందాయని వెల్లడించారు. హైకోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉందని, పూర్తిస్థాయిలో స్పష్టత రాకముందే వారు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలను కోవటం సరికాదని పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చండి..



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

కూసుమంచి: ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరిరావు డిమాండ్ చేశారు. ఆదివారం కూసుమంచిలోని ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తొలి, మలి దశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారుల త్యాగాలు, బలిదానాల పునాదులపై తెలంగాణ ఏర్పడితే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను పక్కనపెట్టి ఉద్యమ ద్రోహులను అందలం ఎక్కించిందన్నారు. అనంతరం ఉద్యమకారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు పలికగా ఎన్నికల సమయంలో పెన్షన్, ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి 15 నెలలు దాటినా అమలు చేయలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ మాదిరి కాంగ్రెస్ అప్రజాస్వామ్య విధానాలను విడనాడాలని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడాలని హితవుపలికారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రఫుల్ రాంరెడ్డి, బత్తుల సోమయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాధవీరెడ్డి, నాయకులు అన్వర్, పటేల్, తుల్జారెడ్డి, రాజేంద్రప్రసాద్, చంద్రన్న, ప్రసాద్, డోలక్ రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటమి ఉంటాయి

- ఉద్యోగులకు ఆటలు ఉపశమనం కలిగిస్తాయి..
- కోలిండియా అథ్లెటిక్స్ మీట్‌లో డైరెక్టర్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): క్రీడల్లో గెలుపుతోపాటు ఓటమి కూడా ఉంటుందని, వాటిని సమానంగా స్వీకరించాలని, ఆటల్లోని మెళకువలను తెలుసుకొని ముందుకు సాగాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ మీట్ (మహిళలు, పురుషులు)ఆదివారం ముగియగా విజేతలకు ఆయన బహుమతుల ప్రదానం చేసి మాట్లాడారు. 38 విభాగాల్లో క్రీడాపోటీలు జరగగా మహిళలు, పురుషులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 21 విభాగాల్లో పురుషులు బంగారు పతకాలు, 17 విభాగాల్లో మహిళలు బంగారు పతకాలు సాధించారన్నారు. సింగరేణి సంస్థ 5 బంగారు, 10 రజతం, 3 కాంస్య పతకాలు సాధించిందని పేర్కొన్నారు. 100 మీటర్ల పరుగుపందెంలో విజయశాంతి, మేకల ఉదయశ్రీ, కడలి మాన్విత, సుష్మ కాంస్యం, జావెలిన్‌త్రో విభాగంలో కడలి మాన్విత బంగారు పతకం, లాంగ్‌జంప్‌లో ఈ.సుష్మారాణి వెండి పతకం, షాట్‌పుట్‌లో కడలి మాన్విత బంగారు పతకం గెలుచుకగా.. పురుషుల విభాగంలో 1500 మీటర్ల పరుగుపందెంలో ఎస్.క్రాంతికిరణ్ వెండి పతకం, జావెలిన్‌త్రో విభాగంలో కె.రమేశ్ కాంస్య పతకం, లాంగ్‌జంప్‌లో సిల్వ ఆదిత్య వెండి పతకం సాధించారు. వీరంతా సింగరేణి ఉద్యోగులు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఏఎం దేవిడ్‌రాజు

ఖమ్మంమామిళ్లగూడెం: మాదిగలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, అందుకు వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని ఈటీఎండీ ఫౌండర్ ఏఎం డేవిడ్‌రాజు, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ జె.మధుకర్ పేర్కొన్నారు. ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన మాదిగ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని, వాటిని సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. డాక్టర్ జె.చంద్రమౌళీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎంఈఎఫ్ నాయకులు గురుప్రసాద్, టీజీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, నారపోగు వెంకటేశ్వరరావు, బాబు, మోహన్‌రావు, జేవీఆర్, బొక్కా దయాకర్, అనిల్, అంబేడ్కర్, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ‘నేలకొండపల్లి’



నేలకొండపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్, స్వప్నచౌదరి

ఖమ్మంస్పోర్ట్స్: రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ పోటీలు ఆదివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ముగిశాయి. నేలకొండపల్లి జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని దక్కించుకుంది. రెండో స్థానంలో ఖమ్మం అర్బన్ జట్టు నిలిచింది. హోరాహోరీగా కొనసాగిన ఫైనల్ మ్యాచ్‌లో నేలకొండపల్లి – ఖమ్మంఅర్బన్ జట్లు తలపడగా.. ముందుగా బ్యాటింగ్ చేసిన ఖమ్మంఅర్బన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. జట్టులో శశికుమార్ 21, శివ 19, అనిల్ 22, రఘువరన్ 21 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన నేలకొండపల్లి జట్టు 19.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసి విజయం సాధించింది. కిరణ్ 23, శ్రీను 23, అనిల్ 22 రన్స్ చేశారు. ఈఎన్‌టీ వైద్యులు ప్రవీణ్‌కుమార్, సినీనటి స్వప్నచౌదరి, టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ మతిన్, జానీపాషా విజేతలకు బహుమతులు అందజేశారు.

అలరించిన ‘జనరల్ బోగీలు’



జనరల్ బోగీలు నాటికలో సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ‘జనరల్ బోగీలు’ నాటికను ప్రదర్శించారు. జనరల్ బోగీల్లో సామాన్యుల ప్రయాణం, ఇబ్బందులపై నాటికను రూపొందించారు. ఈ నాటికను పీటీ మాధవ్ రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. నాటికను కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ సంస్థ కళాకారులు ప్రదర్శించారు. సావిత్రమ్మగా సురభి ప్రభావతి, ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎం.మధు, హెడ్‌కానిస్టేబుల్‌గా కె.నాగేశ్వరరావు, సీఐగా ఓపరాజు విజయ్, లాయర్‌గా పి.వినయ్ నటించారు. నాటికతో పాటు రాయల్ డాన్స్ అకాడమీ కూచిపూడి నృత్యాలయం, రుద్ర నాట్యాలయం విద్యార్థులు జానపద నృత్యాలు, భరతనాట్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ మహ్మద్ అజీజ్, డాక్టర్ కావ్య చంద, ముకుంద ట్రస్ట్ చైర్‌పర్సన్ చెరుకూరి రాజి, కాళ్ల పాపారావు, యలమూడి రవీంద్ర మాట్లాడారు. అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్క్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఎ.సుబ్రహ్మణ్యకుమార్, కె.దేవేంద్ర, ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవికుమార్, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, కొండల్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికుడు మృతి

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు గ్రానైట్ కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని గువ్వలగూడెంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన రాకేశ్ జానా (24)పై ప్రమాదవశాత్తు బండ రాయి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. నిర్వాహకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఫార్మసిస్ట్ ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీకృష్ణనగర్ రోడ్డు నంబర్-2లో నివాసం ఉండే ఫార్మసిస్ట్ మేకల సాయిరాం (26) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఆదివారం ఖమ్మంఅర్బన్ (ఖానాపురం హవేలి) పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఫార్మసిస్ట్‌గా పనిచేసే సాయిరాం ఈ నెల 19న డ్యూటీ నుంచి ఇంటికి వస్తూ మార్గ మధ్యలో ఎస్‌బీఐ రోడ్డులోని మామిడితోట వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సాయిరాం ఆదివారం మృతి చెందినట్లు తండ్రి పున్నయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని వారు చెప్పారు.

ఉరి వేసుకుని యువకుడు...

కూసుమంచి: మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన బుర్ర దర్గయ్య (30) శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. దర్గయ్య మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితుల్లో తన భార్య పుట్టింటికి వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్...

చుంచుపల్లి: మండలంలోని పెనగడప గ్రామ పంచాయతీకి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బిజ్జా ఆదినారాయణ (50) పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఆదినారాయణ గతేడాది నవంబర్‌లో ఆయన భార్య గుండెపోటుతో మృతి చెందగా అప్పటినుంచి మనోవేదనకు గురవుతున్నాడు. వారం రోజుల కిందట గడ్డి మందు సేవించారు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా ఆదివారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ముదిగొండ: మండలంలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరు సమీపంలో నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. రెండు ఇసుక ట్రాక్టర్లను సువర్ణాపురం, న్యూలక్ష్మీపురం వద్ద పట్టుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అశ్వారావుపేటలో...

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక అదనపు ఎస్‌ఐ రామ్మూర్తి కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం శివారులోని వాగు నుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, ట్రాక్టర్ యజమాని గోలి చంద్రశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మావోయిస్టుల డంప్ లభ్యం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్, మెట్టగూడా క్యాంప్ పరిధి కామెట్టాకొండ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాచిన డంప్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆదివారం మావోయిస్టుల సంచారం ఉందనే సమాచారంతో మెట్టాగూడా క్యాంప్ నుంచి 203 బెటాలియన్ కోబ్రా, 131 బెటాలియన్ సీఆర్పీఎఫ్, జిల్లా పోలీసు బలగాలు కామెట్టాకొండ అటవీ ప్రాంతంలోకి గాలింపు కోసం వెళ్లాయి. పెద్ద రాళ్ల మధ్యన మావోయిస్టులు దాచి ఉంచిన డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మణుగూరుటౌన్: మండలంలోని సాంబాయిగూడెంలో ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. వాసంపల్లి లక్ష్మికి చెందిన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. పెంకుటిల్లు పూర్తిగా కాలిపోగా ఇంట్లోని బంగారు నగలు, డబ్బు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. బీటీపీఎస్‌కు చెందిన రెండు ఫైరింజన్లు, మణుగూరు ఫైరింజన్ సిబ్బంది సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సర్వస్వం కోల్పోయిన లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించింది.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కారేపల్లి: మండలంలోని రేలకాయలపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.4,700 నగదుతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మూడు ప్రమాదాలు.. ఐదుగురికి గాయాలు



గాయపడిన మహిళను వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఖమ్మానికి చెందిన వేణుకుమార్, సంధ్య దంపతులు, తమ చిన్నారితో కలిసి బైక్‌పై కోదాడ వైపు వస్తున్నారు. ఆచార్లగూడెం వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా ఖమ్మం తరలించారు. నేలకొండపల్లికి చెందిన షేక్ మదర్సవలీ కోదాడ వైపు నుంచి నేలకొండపల్లికి వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో డివైడర్ తగిలి తీవ్రంగా గాయపడగా ఖమ్మం తరలించారు. చెరువుమాధారం క్రాస్‌రోడ్ వద్ద బైక్ పైనుంచి పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని కోదాడ తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి...

పెనుబల్లి: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన బీరవల్లి వీరయ్య, బీరవల్లి వెంకటి, బీరవల్లి మోహన్‌రావు చెన్నూరుకు చెందిన ఆటోలో కొత్తగూడెం బయలుదేరారు. ఆటో మండలంలోని టేకులపల్లి వద్దకు చేరుకోగా జంగారెడ్డిగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఆటోడ్రైవర్‌తో పాటు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీఎంబంజర్ ఏఎస్‌ఐ సత్యనారాయణ క్షతగాత్రులను 108 వాహనంలో పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పోక్సో కేసు నిందితుడు అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేసి లైగింకదాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. నాలుగు రోజులు కిందట నమోదైన పోక్సో కేసులో ఖమ్మం రూరల్ మండలం పోలిశెట్టిగూడెనకు చెందిన ఎ.వంశీని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.